# జిల్..జిల్...పజిల్




**ఆంధ్రతేజం,** దినపత్రిక ఆఫీస్ మెమో:

మిస్ మేనక (ఎడిటర్) నుండి

శ్రీ సూర్యనారాయణ (ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్) గార్కి    తారీకు : జనవరి 2

సూర్యనారాయణ గార్కి,

మన పత్రికలో 'గడి లో సుడి' అనే క్రాస్‌వర్డ్ పజిల్ శీర్షిక మొదలుపెడుతున్నామని మీకు ఇదివరకే చెప్పాను కదా. శీర్షిక నిర్వహించే ఆసక్తి ఉన్నవాగు అప్లయి చేయవచ్చని పత్రికలో ప్రకటన ఇవ్వడం జరిగింది. వచ్చిన అప్లికేషన్స్ నుండి ఇద్దరిని సెలక్ట్ చేయడం జరిగింది. ఒకరు తిరుపతిలో ఉండే చంద్రమోహనరావు అనే సీరియస్, సీనియర్ రచయిత. ఇంకొకరు విజయవాడలో ఉండే రవికాంత్ అనే సరదా రచనలు చేసే యువ రచయిత.

రకరకాల పాఠకులు ఉంటారు కాబట్టి వెరైటీ కోసం ఈ ఇద్దరు వేర్వేరు తరహా రచయితల చేత ఆ శీర్షిక నడిపిస్తే బాగుంటుందనిపించింది. ఆదివారంనాడు ఆ కాలమ్ ఎలాగూ ఉండదు కాబట్టి సోమ, బుధ, శుక్ర వారాలలో చంద్రమోహనరావు చేత మంగళ, గురు, శని వారాల్లో రవికాంత్ చేత చేయిద్దామని నా ప్లాను. అచ్చులో ఇద్దరిపేర్లూ కనబడవనీ, 'నిర్వహణ: తేజ' అనే వేస్తామని, రెండువారాలు ముందుగానే మేటర్ పంపించాలని, పజిల్ ఒక్కింటికి రూ॥ 250/- ఇస్తామనీ ఇద్దరికీ తెలియబరచటం

జరిగింది.

చంద్రమోహనరావు గారు ఉత్తరం ద్వారా తమ ఆమోదాన్ని తెలిపారు. ఏదో పనిమీద విజయవాడ నుంచి వచ్చిన రవికాంత్ నిన్న మన ఆఫీసులో నన్ను కలిసి పజిల్ గురించి నాతో చర్చించారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి కాబట్టి సంక్రాంతి నుండి ఆ శీర్షిక మొదలుపెడుతున్నాము. రచయితల అడ్రసులు రాసిన కాగితం జతపరుస్తున్నాను. ప్రచురణ అయిన వారాంతానికే సొమ్ము పంపిస్తానని హామీ ఇచ్చి ఉన్నాను. మీరు మీ స్టాఫ్‌కి ఈ విషయంతో తగు సూచనలు ఇవ్వగోర్తాను - మేనక

లలిత, సెక్రటరీ టు ఎడిటర్, ఆంధ్రతేజం మార్చి 3

మేనక, ఎడిటర్ గార్కి - 'గడిలో సుడి' శీర్షిక గురించి ఒక ఉత్తరం వచ్చింది. దానికి సంబంధించి పాఠకుల నుండి వచ్చిన ఉత్తరాల సంగతి తక్కిన స్టాఫ్ చూసుకుంటున్నారు కాబట్టి మీరు ఆ శీర్షికపై దృష్టి పెట్టలేదని తెలుసు. కానీ మార్చి 2న వచ్చిన ఉత్తరం మాత్రం ప్రత్యేకంగా చూడమంటూ సబ్-ఎడిటర్ మీకు పంపారు. లోకల్ లెటరే. రాసినది అమ్మాయి పేరూ, మీ పేరూ ఒక్కటే. మీది చాలా అరుదైన పేరు కాబట్టి ఆ పేరున్నవాళ్లు రాసిన ఉత్తరం అని కాకుండా, ఆమె రాసిన విషయం మీ దృష్టికి తేవాలని సబ్ ఎడిటర్ మీకు పంపారు. జతపరచాను. - లలిత

మేనక, స్టెనో, వైభవ్ ఇంజనీరింగు కంపెనీ మార్చి 1

ఎడిటర్ గార్కి, నమస్తే. సంక్రాంతి నుండి మీరు ప్రారంభించిన 'గడి లో సుడి' శీర్షిక చాలా ఆసక్తికరంగా సాగుతోంది. కానీ పజిల్ శీర్షికే ఒక పజిల్‌లా ఉందని అనిపిస్తోంది నాకు అప్పుడప్పుడు. తేజ గారు సోమ, బుధ, శుక్ర వారాల్లో ఇచ్చే పజిల్ చాలా ఇంట్రస్టింగుగా, ఒక్కోప్పుడు ఫన్నీగా కూడా ఇస్తారు. కానీ మంగళ, గురు, శని వారాల్లో మాత్రం మహా బోరుగా, అయోమయంగా ఇస్తారు. మా ఆఫీసులో స్టాఫందరమూ ఈ పజిల్ చేస్తూంటాము. బొత్తిగా తెలివితేటలు లేని వాళ్లమేమీ కాదు. నాకు ప్రత్యేకంగా దీంట్లో చాలా ఏళ్ల అనుభవం ఉంది. అయినా ఆయన ఇచ్చిన క్లూ తట్టదు. తేజ గారు ఒక్కోరోజు ఒక్కోలా ఎందుకు రాస్తారో తెలియదు. అసలు 'తేజ ఒకళ్లు కాదు, ఇద్దరు' అని అంటూంది మా కొలీగ్ ఒకామె. నిజమేనా? అయితే మంగళ, గురు, శని వారాల్లో రాసే ఆయన్ని తక్షణం తీసిపారేయండి. సోమవారం ఆయన్నే వారమంతా రాయమనండి - ఇట్లు మేనక.

తా.క. మీ ఆదివారం ప్రత్యేక సంచికలో వచ్చే 'వంటా-వార్పూ' కాలమ్ చాలా బాగుంటుంది. అది చూసి నేను తయారు చేసి పట్టుకొచ్చినది మా ఆఫీసులో అందరికీ బాగా నచ్చుతుంది.

మేనక, ఎడిటర్, ఆంధ్రతేజం మార్చి 6

కుమారి మేనక, వైభవ్ ఇంజనీరింగు కంపెనీ గార్కి

మేనక గార్కి, నమస్తే. మీ ఉత్తరానికి ధన్యవాదాలు. కొన్ని రోజుల్లో పజిల్ కఠినంగా ఉంటోందని మీరు రాసారు. రకరకాల పాఠకులను దృష్టిలో పెట్టుకుని ఆ శీర్షిక తయారు చేయబడిందని గుర్తించగోర్తాను. 'అయోమయం'గా ఉందని మీకనిపించిన వాటినే ఛాలెంజ్‌గా తీసుకుని గడులు పూరించేవారుంటారని గ్రహించగోర్తాను. 'వంటా-వార్పూ' గురించిన మీ అభినందనలను ఆ శీర్షిక చూసే సబ్-ఎడిటర్‌కు అందజేసాను - మేనక

మేనక, వైభవ్ ఇంజనీరింగు కంపెనీ మార్చి 9

ఎడిటర్ మేనక గార్కి, మీ ఉత్తరం చేరింది. మీరు నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదనుకుంటాను. మాకు పజిల్ నచ్చనిది 'కొన్ని రోజుల్లో' కాదు. మంగళ, గురు, శని వారాల్లో మాత్రమే. ఇంతకీ తేజ ఒక్కరా? ఇద్దరా? - మేనక

లలిత, సెక్రటరీ టు ఎడిటర్, ఆంధ్రతేజం మార్చి 11

మేనక, వైభవ్ ఇంజనీరింగు కంపెనీ గార్కి – నమస్తే. ఎడిటర్ మేనక గార్కి మీ ఉత్తరం చేరింది. కలంపేరుతో రాసే రచయితల పేర్లు వెల్లడించడం మా పత్రిక పాలసీ కాదని మీకు తెలియబరచమన్నారు – లలిత

మేనక, వైభవ్ ఇంజనీరింగు కంపెనీ మార్చి 12

లలిత, సెక్రటరీ టు ఎడిటర్, ఆంధ్రతేజం గార్కి,

'తేజ' ఇద్దరు అని మీ ఉత్తరం బట్టే తెలిసిపోయింది! ఒక్కరే అయివుంటే ఆ విషయం గట్టిగా రాసి వుండేవారు. అయినా మీరు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మొన్నవారం పేపర్లే చూడండి. సోమవారం నాడు 8 అడ్డం 'ఆడవాళ్ల బెస్ట్ ఫ్రెండ్' (ఆన్సర్: బ్రా) అని భలే సరదాగా క్లూ ఇచ్చారు. మా ఆఫీసులో వాళ్లందరూ ఆ పద చమత్కారానికి పడిపడి నవ్వుకున్నాము. అదే మంగళవారం 8 అడ్డం చూడండి – అన్నమయ్య కీర్తనలో అలివేలు మంగ చేసే పని (ఆన్సర్: బెగళించు) బెంగళించు ఏమిటండి? అసలా మాట వాడుకలో ఉందా? అన్నమయ్య వేలాది పాటలు రాస్తే అన్నీ మేం కంఠతా పట్టాలా? అసలా క్లూ ఇచ్చినవాళ్ల ఉద్దేశ్యం ఏమిటని? అందుకే ఇద్దరు వేర్వేరు తరహా మనుషులు రాస్తున్నారని మేమందరం అనుకుంటున్నాము.

మా వైభవ్ ఇంజనీరింగ్ కంపెనీ స్టాఫంతా నాతో ఏకీభవిస్తున్నారు. అందరం వెళ్లి మేనేజరుకి చెప్పాము – మంగళ, గురు, శని వారాల్లో మీ పేపరు కాకుండా 'ఆంధ్రప్రజ' పేపరు వేయించమని. వాళ్ల క్రాస్‌వర్డ్ పజిల్ అంత గొప్పగా ఉండదు కానీ మీ మంగళవారం అయన కంటే లక్ష రెట్లు మెరుగు. – మేనక

మేనక, ఎడిటర్ మార్చి 14

ఆంధ్రతేజం మార్కెటింగ్ మేనేజర్ గార్కి – వైభవ్ ఇంజనీరింగ్ కంపెనీ వాళ్లు వారంలో మూడు రోజులు మన పేపరు మాన్పించేసి 'ఆంధ్రప్రజ' కొనబోతున్నారని తెలిసింది. నిజానిజాలు తెలుసుకోగోర్తాను – మేనక

సుబ్రమణ్యన్, మార్కెటింగ్ మేనేజర్, ఆంధ్రతేజం మార్చి 14

మేనక, ఎడిటర్ గార్కి – మీకు వచ్చిన సమాచారం కరెక్టే. ఆంధ్రప్రజ మార్కెటింగ్ మేనేజరును నిన్న ఒక కాన్ఫరెన్స్‌లో కలవడం జరిగింది. 'మీ పత్రిక చందాదార్లు మాది కొనడం మొదలెట్టారు తెలుసా?' అంటూ పోజు కొట్టాడు. అడగ్గా, అడగ్గా వైభవ్ ఇంజనీరింగు కంపెనీ నుండి వాళ్ల చందారేట్ల గురించి వాకబు చేసారని చెప్పాడు. ఒక చందాదారు తగ్గితే మీకు చెప్పేదేముందిలే అని ఊరుకున్నాను. – సుబ్రమణియన్

రవితేజ, విజయవాడ మార్చి 14

మేనక, ఎడిటర్ గార్కి – మీ పత్రికలో నా పజిల్ ప్రచురణ జరగగానే పారితోషికం పంపుతున్నారు. నేను మేటర్ పంపించగానే డబ్బు పంపే ఏర్పాట్లు చేయించగలరా? నేను రాస్తున్న నవల పూర్తి కాలేదు. పబ్లిషరు ఇస్తానన్న అడ్వాన్స్ పంపలేదు – రవితేజ

మేనక, ఎడిటర్ మార్చి 17

రవితేజ గార్కి – ఓ చేత్తో పజిల్ తయారు చేస్తూ మరో చేత్తో నవల రాద్దామనుకుంటే అది మీ తలకాయనొప్పి. మీరు ఇక్కడకు వచ్చినప్పుడు కూడా చెప్పాము – ప్రచురణ జరిగేకనే పేమెంటు జరుగుతుందని. ఈవాళ మీ అవసరాల గురించి పద్ధతి మారదు.

ఇది పక్కనబెడితే మీరు పంపుతున్న పజిల్స్ తమాషాగా, సరదాగా ఉంటున్నాయి. ఆడవాళ్ల బెస్ట్ ఫ్రెండ్ గురించి మీరు రాసినది చదివి నాకు నవ్వు వచ్చింది. పాఠకులొకరు దాని గురించి రాసారు కూడా. – మేనక

మేనక, ఎడిటర్ మార్చి 17

చంద్రమోహన్ గార్కి – నమస్తే. మీరు పంపుతున్న పజిల్స్ నేను పరిశీలిస్తున్నాను. మంగళ, గురు, శని వారాల్లో 'గడి లో సుడి' గురించి కొందరు పాఠకులు ఫిర్యాదు చేసారు కూడా. మీరిచ్చే క్లూలు కొన్ని అయోమయంగా ఉంటున్నాయి. ఉదాహరణకి మొన్న మంగళవారం మీరిచ్చిన 'బెంగళించు' అనే మాట ఎక్కడా వాడుకలో లేనిది. సోమ, బుధ, శుక్ర వారాల్లో వస్తున్న పజిల్స్ చూడగోర్తాను. నేను పాఠకులకు అందిద్దామనుకున్నదానికి అనుగుణంగా ఉందది. మీరు కూడా ఇకపై ఆ ప్రకారం రాస్తారని ఆశిస్తాను. – మేనక.

రవితేజ మార్చి 19

మేనక, ఎడిటర్ గార్కి – మీరు పజిల్స్ చూస్తారని తెలిసి ఆశ్చర్యపడ్డాను. మీకంత తీరిక ఉంటుందా? క్లూల ద్వారా నేను వేసే జోక్స్ మీకు నచ్చుతున్నందుకు థాంక్స్. నా అభిమాని ఎవరో ఉత్తరం రాసారన్నారు. అది నాకు పంపితే చాలా ఉత్సాహకరంగా ఉంటుంది. నా నవల పూర్తి కాలేదు. పబ్లిషరు డబ్బు పంపలేదు. – రవితేజ

తా.క : నా పజిల్స్ నచ్చాయంటున్నారు కదా, నా పారితోషికం పెంచడం ద్వారా నన్ను ప్రోత్సహించవచ్చు కదా?

మేనక, ఎడిటర్ మార్చి 22

రవితేజ గారికి – సారీ, పారితోషికం పెంచడం అసంభవం. ఇప్పటికే అనుకున్నదానికంటే పజిల్ ఖర్చులు పెరిగాయి. ఇక ఉత్తరం మీకు పంపడం గురించి – అది రాసినది మీ అభిమాని కాదు. మా పత్రికలో ఏమేమి తనకు నచ్చుతాయో రాస్తున్న పాఠకురాలు. సోమ, బుధ, శుక్రవారం పజిల్స్ నచ్చుతాయని రాసింది అంతే! – మేనక

రవితేజ మార్చి 25

మేనక, ఎడిటర్ గార్కి – అయితే నా అభిమాని ఒక అమ్మాయి అన్నమాట. నా గురించి మెచ్చుకున్నందుకు కృతజ్ఞతలు చెబుతూ నేను ఆమెకు ఉత్తరం రాస్తే అది మీరామెకు పంపుతారా? నా నవల పూర్తి కాలేదు, పబ్లిషరు డబ్బు రాలేదు. కరెంటు బిల్లు కట్టేందుకు డబ్బు లేదు. ఇలాటి పరిస్థితుల్లో ఒక అందమైన, చక్కని అభిరుచి గల అమ్మాయి నుండి ఉత్తరం వస్తే అది ఎంత ఉత్తేజకరంగా ఉంటుందో ఊహించండి. – రవితేజ

చంద్రమోహనరావు, తిరుపతి మార్చి 22

మేనక, ఎడిటర్ గారికి – నేను సెమినార్ నుండి తిరిగివచ్చేసరికి మీ ఉత్తరం పడి ఉంది. పజిల్స్ రాయడం నేను వేరే వారి దగ్గర నేర్చుకోవడమేమిటి? నాన్సెన్స్! 'బెంగళించు' అనే సాధారణమైన మాట కూడా తెలియని పాఠకులు మీకు రాయడం, అది పట్టుకుని మీరు నన్ను సోమవారం ఆయన దగ్గర శిష్యరికం చేయమనడం ఆశ్చర్యంగా ఉంది. నేనూ ఆయన పజిల్స్ చూస్తున్నాను. ఆడవాళ్ల బెస్ట్ ఫ్రెండు అంటూ అశ్లీలమైన క్లూలు ఇస్తున్నాడాయన. ఆయన గురించి మిమ్మల్ని నేను హెచ్చరిద్దామనుకున్నాను. ఇంతలోనే మీ ఉత్తరం! ఇలా అయితే మన ఒప్పందం సాగడం కష్టం. రద్దు చేసుకుంటే మంచిది – చంద్రమోహనరావు

మేనక, ఎడిటర్

మార్చి 25

చంద్రమోహనరావు గారికి – మన మధ్య ఉన్నది మామూలు ఒప్పందం కాదనీ, లీగల్ అగ్రిమెంటని గుర్తుంచుకోగోర్తాను. మీకు ఇష్టం లేకపోయినా మీ చేత రాయించే ఉబలాటం నాకు లేదు. మీ స్థానంలో వేరొకరు దొరికేదాకా మీరు యథాప్రకారం పంపిస్తూనే ఉండండి. పంపించాలి కూడా. మీరిచ్చే క్లూలు సామాన్య పాఠకులకు అర్థం కావని మా కనిపిస్తే మార్చే అధికారం మాకు ఉందని మీరు గుర్తుంచుకుంటే మంచిది. – మేనక

మేనక, ఎడిటర్

మార్చి 25

రవితేజ గారికి – మీ నవల పూర్తికాకపోవడం, కరెంటు కట్ అయ్యే ప్రమాదం తొలగకపోవడం అనే కారణాల వల్ల మీరు పజిల్స్ కోసం ఎక్కువ టైము కేటాయిస్తారని ఆశిస్తాను. మంగళ, గురు, శని వారాల్లో పజిల్ తయారు చేసే ఆయన సరిగ్గా రాయడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. అందువల్ల ఆ పని కూడా మీకు అప్పజెప్పుతున్నాము. అవి కూడా సకాలంలో అందిస్తారని ఆశిస్తున్నాను. ఇది తాత్కాలికమైన ఏర్పాటు మాత్రమేనని గ్రహించగోర్తాను. చాలా తక్కువ వ్యవధిలో అడుగుతున్నాను కాబట్టి, ఆ మూడు రోజుల పజిల్స్‌కి మాత్రం రూ॥ 300.00ల చొప్పున చెల్లించేట్లు మా మేనేజిమెంటు వారిని ఒప్పించాను. ఇక మీ 'అభిమాని' ఉత్తరం గురించి – అది మీకు పంపడం జరగదు. ఆమె అందమైనదీ, చక్కటి అభిరుచి గలదీ అవునో కాదో గానీ పేరు మాత్రం మేనక. అవును, నా పేరే. – మేనక.

రవితేజ

మార్చి 27

చాలా థాంక్స్. మంగళవారం ఆయన పజిల్స్ నాకూ నచ్చలేదు. కానీ సాటి రచయితను కించపరచడం ఇష్టం లేక నేనిన్నాళ్లూ ఊరుకున్నాను. మీ ప్రతిపాదన నాకు సమ్మతమే. మేనక చాలా అందమైన పేరు.- రవితేజ

మేనక, వైభవ్ ఇంజనీరింగ్ కంపెనీ

ఏప్రిల్ 26

మేనక, ఎడిటర్ గారికి – వారంలో సగంరోజులు మీ పత్రిక ఆపేస్తామంటూ నేను ఇదివరలో ఉత్తరం రాసాను కానీ మీ 'వంటా–వార్పూ' శీర్షిక కోసం ఆ పని చేయలేదు. ఇంతలోనే మీ పత్రికలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఆరురోజుల పజిల్సూ బాగుంటున్నాయి. మా ఆఫీసులో కూడా అందరూ అదే మాట! ఇవాళ్టి పజిల్‌లో 9 నిలువు చూసారా? 'అప్సరసలో గాంధీగారు తాగే పాలు' అనే క్లూ ఇచ్చారు. జవాబు అందరికీ తట్టింది – 'మేనక'. నా పేరే! మా ఆఫీసులో కూడా అందరూ అదే అన్నారు. భలే చిత్రంగా ఉంది. తేజ గారి పేర నేనొక ఉత్తరం రాసి జతపరుస్తున్నాను. అది వారికి అందజేయగోర్తాను. తేజగారిలో వచ్చిన మార్పుకి మేమందరమూ హర్షిస్తున్నామని తెలుపగోరుతాము – మేనక

మేనక, ఎడిటర్

ఏప్రిల్ 30

రవితేజ గారికి – మేనక అనే పాఠకురాలి వద్ద నుండి వచ్చిన ఉత్తరం మీకు పంపుతున్నాను. క్రితంసారి నేను ఆమె పేరు తెలియబరచడం వల్ల మీరు తెలివిగా ఆమె పేరును క్లూగా ఇచ్చేరని అర్థమయింది. మళ్లీ ఇంకోసారి మేనక పేరు జవాబుగా (అందునా గాంధీ గారి పేరు ఉపయోగిస్తూ అశ్లీలంగా క్లూ ఇస్తే) వస్తే మన ఒప్పందం రద్దవుతుందని గ్రహించగోర్తాను. – మేనక

కాన్ఫిడెన్షియల్

లెఫ్టినెంట్ కల్నల్ గజపతి నాయుడు జూన్ 2

మేనక, ఎడిటర్ గారికి – నేను ఇందుమూలముగా మిమ్మల్ని హెచ్చరించేదేమంటే దేశవ్యతిరేక కార్యకలాపాలకు వేదికగా మీ పత్రికను ఉపయోగించుకోవడం జరుగుతోంది. మీ పజిల్స్ ద్వారా ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ జరుగుతున్నట్టు తోస్తోంది. నేను గత రెండేళ్లగా మీ 'గడి లో సుడి' చేస్తూ ఉంటాను. గత నెల్లాళ్లగా జవాబులను పరికించి చూడగా 'నేనంటే ఇష్టమేగా?' 'ఇంకా తెలియలేదా?' 'సాయంత్రం కలుద్దాం' 'బిగికౌగిలి' 'ఫ్రెంచ్ కిస్' 'మేనక మేనుకై తపన' ఇలా జవాబులు వస్తున్నాయి. ఇద్దరు దేశద్రోహులు ఏదో కోడ్‌లో సంకేతాలు పంపుకుంటున్నారని దీన్ని బట్టి అర్థమవుతోంది. నేను ఈ విషయమై హోమ్ సెక్రటరీకి రాసాను. మీ హితైషిని కాబట్టి ముందుగానేమీకు తెలియబరుస్తున్నాను. లాయర్ని సంప్రదించి పెట్టుకోండి. మీరు కూడా కటకటాల వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది – గ.నాయుడు

మేనక, ఎడిటర్ జూన్ 3

లలిత, సెక్రటరీ కు – ఈ నాయుడు గారి ఉత్తరం చెత్తబుట్టలో పారేయి. ఇంతకుముందు ఈయనకి మనం ప్రచురించిన చేగోడీల బొమ్మల్లో అణుబాంబు డిజైన్ కనబడింది. పెద్దగోల చేసాడు. అప్పటి అనుభవంతో పోలీసులు ఈయన మాటలు పట్టించుకోరు. కానీ రవితేజ పజిల్స్ ద్వారా మేనకకు ప్రేమసందేశాలు పంపుతున్నాడని స్పష్టమయింది నాకు. ఈ నాయుడి గారి ఉత్తరం వచ్చాక పాత సంచికలన్నీ చదివిచూసానులే. నువ్వొకసారి శ్రమ అనుకోకుండా వైభవ్ ఇంజనీరింగు కంపెనీకి వెళ్లి అక్కడ మేనకను స్వయంగా కలిసి వచ్చి ఆమె ఎలా ఉందో చెప్పగోర్తాను. జస్ట్ క్యూరియాసిటీ! అంతే! రవితేజను నేను స్వయంగా చూసాను. మనిషి బాగుంటాడు. ఈ మేనక ఎలా ఉంటుందో చూద్దాం. – మేనక

మేనక, ఎడిటర్ జూన్ 5

ఆంధ్రతేజం తిరుపతి ఆఫీసు మేనేజరు గార్కి – నమస్తే. రవితేజ అనే ఆయన మన పత్రికలో పజిల్స్ రాస్తూంటారు. ఈ ఊళ్లోని వైభవ్ ఇంజనీరింగు కంపెనీలో పనిచేసే మేనకను ఆకర్షించడానికి ఆయన పజిల్స్‌ను ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణపై విచారణ జరిపించగా అసలా కంపెనీలో మేనక అనే అమ్మాయే లేదని తెలిసింది. ఇదంతా రవితేజ ప్లానులా ఉంది. తిరుపతిలో చంద్రమోహనరావు గారు అనే రచయిత ఉన్నారా? లేక రవితేజయే ఆ పేరుతో సీరియస్ రచనలు చేస్తున్నారా? అనే విషయం విచారించి వెంటనే తెలియబరచగోర్తాను. – మేనక

మేనక, ఎడిటర్ జూన్ 10

రవితేజ గార్కి – మీ తెలివికి జోహార్లు. బహుముఖప్రజ్ఞాశాలురైన మీరు చంద్రమోహనరావు పేరుతో సీరియస్ రచనలు, రవితేజ పేరుతో సరదా రచనలు చేస్తున్నారని తెలిసిపోయింది నాకు. రెండు అప్లికేషన్లు పెట్టి, ఒకరిపై ఒకర్ని పోటీగా పెట్టి చివరికి మీ పారితోషికం పెరిగేట్లా చేసారు. పైగా మేనక అనే పాఠకురాలిని సృష్టించి మీ పజిల్స్ గురించి, వాటి ద్వారా మీరు నాకిద్దామనుకున్న ప్రేమ సందేశాల గురించి నా దృష్టిని ఆకట్టుకున్నారు. నన్ను మీరు స్వయంగా చూసారు కాబట్టి నేను మీకు నచ్చిన తర్వాతనే ఇదంతా చేసారని అనుకుంటున్నాను. మీరూ, మీ తెలివితేటలూ నాకు చాలా నచ్చాయి. నన్ను పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం మీకుంటే ఈసారి సోమవారం పజిల్‌లో 'మేనకా, పెళ్లాడదాం రా' అనే జవాబు వచ్చేట్లా క్లూ ఇవ్వగోర్తాను. – మీ దాని నను కునే, మేనక.

●

(ఆంధ్రజ్యోతి ఆదివారం మే 1999)

ఎమ్బీయస్ ప్రసాద్

# ఆలూమగలీయం

## ఫైరింగ్ రేంజ్

> తమిళనాడులో ఇద్దరు స్త్రీలు ఒకరినొకరు
> వివాహం చేసుకున్నారు – వార్త

"ఏమండోయ్, పేపర్లో ఈ వింత వార్త చూసారూ?"

"గుడ్, పేపరు చదివి నాలెడ్జి పెంచుకోమని నేను పోరు పెట్టడం లాభించిందన్నమాట. ఇంతకీ ఏమిటా వార్త?"

"మీరీ పాటికి చదివే ఉంటారు లెండి. పొద్దున్నుంచీ పన్లన్నీ ఎగ్గొట్టి మీరు చేస్తున్నదదేగా? ఏమీ లేదూ, ఇద్దరు ఆడపిల్లలు పెళ్లి చేసుకున్నారట!"

"ఇదా వార్త!? ఇంతకంటే గొప్ప వార్త దొరకలేదూ! పేపరు చూసేటప్పుడు హెడ్‌లైన్స్ చదవడం మానేసి 'గృహిణి ఆత్మహత్య', 'నగరశివార్లలో దోపిడీ' లాటి వార్తలే చదువుతారు మీ ఆడాళ్లు. రోజుకి బోల్డుమంది ఆడపిల్లలు పెళ్లి చేసుకుంటూ ఉంటే అదో గొప్ప న్యూసా?"

"సరిగ్గా అర్థం చేసుకోరు కదా, ఆ ఆడపిల్లలు విడివిడిగా పెళ్లి చేసుకోవడం విశేషం కాకపోవచ్చు కానీ వాళ్లు ఒకళ్లనొకళ్లు చేసుకోవడం వింత కాదూ?"

"మై గుడ్‌నెస్! ఏదీ, ఎక్కడుందీ పేపర్లో?"

"అందుకే మరి, ఆడవాళ్ల కున్న పరిశీలనాశక్తి మగాళ్ల కుండదంటారు. చెప్తాను వినండి. దిండిగల్‌లో ఇద్దరు అమ్మాయిలు కలిసి కాపురం పెట్టారుట. అందులో ఒకమ్మాయి మొగుణ్ని వదిలేసి వచ్చిందట కూడా..."

"ప్చ్... అంతా దీపా మెహతా మహత్యం! సినిమాలు తీసి ఆవిడ నేర్పి పెడుతోంది!"


"ఎవరూ? 'వాటర్' ఫైటర్‌లేడీయా?"

"నీళ్లతో సరిపెట్టలేదు. సంసారాలలో నిప్పులు పోస్తోంది. ఆ మధ్య 'ఫైర్' అని సినిమా తీసిందిలే! ఇద్దరు తోడికోడళ్ల మధ్య అసహజమైన ప్రేమ అంకురిస్తుంది..."

"అయ్యో పాపం! అదేం?"

"ఒకమ్మాయి భర్త తిరుగుబోతు, మరోడు భక్తి పారవశ్యంలో కొట్టుకుపోయేవాడు అనుకుంటాను. ఏదో సాకు... అయినా ఇలాటివి గ్లోరిఫై చేయడం తప్పు."

"అది వాళ్ల దీనావస్థను చూపిస్తోందన్నమాట. ఆడవాళ్లు ఇన్‌సెక్యూర్‌గా ఫీలవుతున్నారని అర్థం. ఈనాటి స్త్రీకి ఓ పట్టాన పెళ్లవుతుందో లేదోనన్న భయం, పెళ్లయినా అత్తమామలు కాల్చుకు తింటారేమోనని భయం, మొగుడికి ఎన్నాళ్లలో మోజు తీరిపోతుందోనన్న భయం..."



"...వేపుకు తినడానికి మొగుడు ఒప్పుకుంటాడో లేదోనన్న భయం..."

"...మీ హాస్యాలు పక్కన బెట్టండి. ఏ లెవెల్లో ఉన్న ఆడదానికైనా డబ్బు విషయంలో ఎవడు మోసం చేస్తాడోనన్న భయం ఉందా, లేదా?"

"ఉంటే మాత్రం? మామూలు పెళ్లి మానేసి ఇలాటి ప్రకృతి విరుద్ధమైన పనులు చేయవచ్చా?"

"కట్నాలు అడగడం మాత్రం ప్రకృతి నేర్పిందా? ఆడదాన్నీ, మగాడినీ ఒకరికొకరు తోడుగా, సరిసమాన సంఖ్యలో దేవుడు సృష్టించినప్పుడు దాని అర్థం ఏమిటి? కలిసి బతకమనేగా! మరి మగాళ్లు అలా బిర్ర బిగుసుకు కూచుంటే ఆడాళ్లు ఏం చేయాలని మీ ఉద్దేశ్యంట?"

"నా విషయంలో ముందే చెప్పాను - కట్నం నేనడగలేదని. మా నాన్న అడిగేడు, మీ నాన్న ఇచ్చాడు. నా ప్రమేయం ఏమీ లేదు. నువ్వు ఒకవేళ ఎత్తిపొడుద్దామని చూస్తే మాత్రం అది నాకు వర్తించదు..."

"...గాడిదగుడ్డు కదూ, అందుకే మా ఫ్రెండ్ జ్వాల అంటోంది - 'మీ ఆయన దగ్గర నుండి కట్నం డబ్బు ఇన్‌స్టాల్‌మెంటులో వసూలు చేసి మీ నాన్నకి పంపేయమని..."

"..జ్వాలా? ఎవరూ ఆ మగరాయుడా? ఆ జీన్స్, ఆ బాయ్ కట్, అప్పుడే అనుకున్నాను ఇలాటివి నేర్పిపెడుతోందని. దూరంగా ఉంచు ఆ ఫైర్‌బ్రాండ్ వెరయిటీని..."

"...మీరంటూ ఉంటే తిట్టిందండి. 'ఫైర్ సినిమా చూడు, చాలా బాగుంటుంది' అంటూ జ్వాల పోరుతోంది. ఇందాకా పేపర్లో వార్తకు 'ఫైర్ కాపురం' అని హెడింగ్ పెడితే అర్థం కాలేదు. ఇప్పుడు, మీరు కథ చెప్పాక తెలుస్తోంది..."

"...వారినాయనోయ్, ఇదెవరో కొంపకి అగ్గెట్టేట్టుంది. నేనూ ఫైరింగ్ రేంజ్‌లో ఉన్నట్టున్నాను. ఆమె ఎలాగూ పెళ్లి చేసుకోలేదు. అసలా సినిమా ప్రస్తావన ఎందుకొచ్చింది మీ మధ్య?"

"...అబ్బే, ఏమీ లేదు, మీరు ఒక్కోప్పుడు ఫిలసాఫికల్‌గా అయిపోవడం, కోపం వచ్చినప్పుడల్లా సన్యాసం తీసుకుంటానంటూండడం, అవన్నీ తనకు చెబుతూంటే..."

"...ఇక చెప్పకు బాబోయ్, సన్యాసం అయిడియానే సన్యసించేసాను. ఇక ఆ మాట ఎత్తను గానీ నువ్వు ఇలాటి నిప్పుతో చెలగాటం ఆడకు, పుణ్యం ఉంటుంది..."